క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతుల కారణంగా శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నాగలాపురంలో ..

నాగలాపురం: నాగలాపురం పట్టణం, మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జైసాయి తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు కారణంగా సరఫరా ఆపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సత్యవేడు మండలంలో..

సత్యవేడు: మండల పరిధిలోని దాసుకుప్పం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ ఏఈ విజయ్ వెంకటేష్ తెలిపారు. అంతరాయాన్ని వినియోగదారులు గుర్తించాలని కోరారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి: కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ కింద పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యశాల డాక్టర్ పవన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి10వ తరగతి వరకు చదివే విద్యార్థులు నవంబరు 30లోపు, ఇంటర్, డిగ్రీ, వృత్తివిద్యా కోర్సులు చదివి విద్యార్థులు డిసెంబరు 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు తమ ఆస్పత్రిలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వేమాలమ్మకు పొంగళ్లు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని చియ్యవరం గ్రామంలో శుక్రవారం గ్రామ దేవత వేమాలమ్మకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కాపిరెడ్డి ఢిల్లీబాబు రెడ్డి, మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ వేమాలయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని చెల్లూరు వ్యవసాయ పొలాల్లో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. చెల్లూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి అదేగ్రామానికి చెందిన వెంకటరాయులు మధ్య భూతగాదాలు ఉన్నట్లు చెప్పారు. శుక్రవారం పొలాలను ట్రాక్టర్‌తో చదును చేస్తున్న వెంకటస్వామిని అడ్డుకున్న వెంకటస్వామిని వెంకటరాయులు, ధనమ్మ, రూకేష్, రమేష్ దాడి చేసి గాయపరిచారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడకు చెందిన భూపతి (41) తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ పరమేష్ నాయక్ కథనం.. పుత్తూరులో పని ముగించుకుని శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో మోపెడ్‌లో భూపతి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. జాతీయ రహదారిలో సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం మోపెడ్‌ను ఢీకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

వెంకటగిరిరూరల్: రైతులు చిరు ధాన్యాల సాగుపై కూడా దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు సూచించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతలో భాగంగా కేవీకేలో సాగవుతున్న చిరుధాన్యాల ప్రదర్శన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. వాటిలో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. చిరుధాన్యాల ఆహారంతో ప్రజలు ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కరుణశ్రీ, రాజీవన, విజయశ్రీ, నాగార్జున రెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

కండలేరులో 11.635 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 11.635 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి 50 కూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు


రాహుకేతు పూజా మండపంలో భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులు


దుర్గమ్మ కొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో కనకాచలంపై వెలిసిన శ్రీదుర్గమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి కొండపైకి అశేష సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించేందుకు వస్తారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు సులభంగా దర్శనం చేసుకునేలా క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అలంకారంలో దర్శనమిస్తారని, భక్తులను కట్టిపడేసేలా అలంకారాలు ఉండాలని సూచించారు. అధికారులు లోకేష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బాలాజీ, వెంకటస్వామి, అర్చకులు తులసీశర్మ పాల్గొన్నారు.

రాహుకేతు మండపాల తనిఖీ

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలోని రూ.500, రూ.750 రాహుకేతు పూజా మండపాలను శుక్రవారం దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆలయ సేవలు ఎలా ఉన్నాయని భక్తులతో ముచ్చటించారు. ఎలాంటి లోటుపాట్లు లేవని భక్తులు తెలిపారు. రాహుకేతు సర్ప దోష నివారణ పూజల్లో, శ్రీస్వామి, అమ్మవార్ల దర్శనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సహకరించాలని సూచించారు.

ఆలయాల ముస్తాబు

శ్రీకాళహస్తి పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద దసరా సందడి మొదలైంది. శరన్నవరాత్రుల వేడుకలకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. క్యూలు, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. పట్టణంలోని కొత్తపేట శీతాలాంబ ఆలయంలో ఏటా శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ ప్రముఖ శ్రీఅవనాక్షమ్మ ఆలయంలో, పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని కామాక్షాంబిక, మండల కేంద్రంలోని ధర్మాజుల ఆలయం, నగరు వీధి రామాలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ఆదివారం నుంచి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అవనాక్షమ్మ ఆలయ టీటీడీ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. రోజూ అమ్మవారికి అభిషేకం, సాయంత్రం రోజూ ఒక అలంకరణలో ఊంజల్‌సేవ ఉంటుందని తెలిపారు. కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం కలశ స్థాపన, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, ఈవో కృష్ణనాయక్ తెలిపారు. ప్రతి రోజు ప్రత్యేక సర్కారు అభిషేకాలు, మహిళలతో కుంకుమార్చన పూజలు ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారిని రోజూ ఒక అలంకరణ చేసి దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు. నారాయణవనం ధర్మరాజుల ఆలయంలో, నగరువీధి రామాలయంలో రోజూ సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలు, పూల తోరణాలతో ముస్తాబు చేస్తున్నారు.


శీతాలాంబ ఆలయం వద్ద ఏర్పాట్లు

దక్షిణ కాళికాదేవి ఆలయంలో

శ్రీకాళహస్తి మండలం వేదాంలోని ప్రముఖ శ్రీదక్షిణ కాళికాదేవి ఆలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారి ఒక్కో రూపంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.


వేదాం దక్షిణ కాళికాదేవి ఆలయం

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 21న జరిగే రెవన్యూ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీనివాసులు నాయక్ అన్నారు. కోర్టు భవనంలో శుక్రవారం ఇన్సూరెన్సు కంపెనీ అధికారులు, న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ ఇన్సూరెన్స్ రికవరీ సమస్యలు, రెవెన్యూ కేసులు, భూకబ్జా కేసులకు సంబంధించి జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కక్షిదారులు కేసుల నుంచి ఉపశమనం పొందాలన్నారు. రాజీమార్గమే రాజమార్గంగా ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులను ఒప్పించి అధిక సంఖ్యలో వాటిని రాజమార్గంలో పరిష్కరించాలన్నారు. న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు డిప్యూటీ సీఎం పరామర్శ

నాగలాపురం: పాలసముద్రం తహసీల్దార్, మండలంలోని కారణి గ్రామానికి చెందిన బాబు తండ్రి కె.దొరస్వామి అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న డెప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ నాగలాపురం నాయకులు అపరంజిరాజు, చిన్నదొరైతో కలిసి కారణి గ్రామానికి చేరుకున్నారు. దొరస్వామి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారు ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలు జరిగాయి. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని అధిష్టింప చేశారు. తదుపరి ఆలయ ప్రాకారంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి ఊంజల్ మండపంలో ఊయలలో కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణల నడుమ ఊయలలో సేదతీరుతున్న అమ్మవారిని దర్శించి భక్తులు తరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.


ఊయలలూగుతున్న అమ్మవారు

దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాళహస్తి: విద్యార్థులు దసరా సెలవుల్లో కూడా బాగా చదువు కోవాలని ఉపాధ్యాయులు సూచించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, మండల పరిధిలోని పలు పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు జరిగాయి. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ-టు పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులు, ప్రగతిని ఉపాధ్యాయులు వివరించారు. మరింత కష్టపడి అధిక మార్కులు సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రభుత్వ పాఠశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా బోధనను వివరించారు. దసరా సెలవుల్లో ఇంట్లో విద్యార్థులు బాగా చదువుకునేటట్లు తల్లిదండ్రులు చూడాలని ఉపాధ్యాయులు సూచించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న ఏడీ నాగార్జునసాగర్

వెంకటగిరి రూరల్: రబీసీజన్‌లో సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని ఏడీ నాగార్జునసాగర్ తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు ఆర్బీకేలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అధికారుల సూచన మేరకు విత్తనాలు, ఎరువులను వినియోగించాలన్నారు. రైతుభరోసా పథకానికి ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏఓ సుజాత, పశువైద్యులు కిషోర్, ఏఎస్ఓ కోటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ధర్మనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏఏబీ చైర్మన్

సూళ్లూరుపేట రూరల్: రైతులు పీఎం కిసాన్, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలకు అన్నదాతలు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఎం దేవేంద్ర తెలిపారు. సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయంలో శుక్రవారం ఏఏడీ మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వరినారు వేసే సమయం రైతులు విత్తన శుద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు భద్రత కల్పిస్తాం

ఏర్పేడు: టీసీఎల్, డిక్షన్ తదితర కంపెనీల్లో పని చేస్తున్న మహిళలకు భద్రత కల్పిస్తామని తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వికృతమాల రెవెన్యూలోని టీసీఎల్ కంపెనీలో ఏర్పేడు, రేణిగుంట, శ్రీకాళహస్తి మండలాల్లో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కర్మాగారాల వద్ద అవుట్ పోస్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. యాజమాన్యాలు సెక్యూరిటీని పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంపెనీల భద్రత కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించారో నివేదికను ఇవ్వాలని చెప్పారు. ఆ నివేదికను బట్టి భద్రతను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. లాఅండ్ ఆర్డర్ అడిషినల్ ఎస్పీ కులశేఖర్, ఎస్బీబీ డైరెక్టర్ రాజేంద్ర, రేణిగుంట డీఎస్పీ భవ్యశ్రీ, ఏర్పేడు సీఐ శ్రీహరి, ఏపీఐఐసీ అధికారులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

సంప్రదాయాలే పట్టుగొమ్మలు

ఏర్పేడు: సంస్కృతి, సంప్రదాయాలు జాతి మనుగడకు పట్టుగొమ్మలని ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు జరిగాయి. విద్యార్థులు తెచ్చిన బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి తీపి గుర్తుగా దసరా చేసుకుంటున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు

జాబ్‌మేళాలో 182 మంది ఎంపిక




మాట్లాడుతున్న సుశీల్‌కుమార్ రెడ్డి, హాజరైన అభ్యర్థులు

సత్యవేడు: సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. జాబ్‌మేళాకు 17 బహుళజాతి కంపెనీల హెచ్‌ఆర్‌లు హాజరయ్యారు. బ్లూస్టార్‌ఏసీ, డైకిన్, కోల్‌మెన్ సర్వీస్, వెర్మేరియన్ ఇండియా, యాంబర్, ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు, మూత్తూట్ ఫైనాన్స్, శ్రీజమిల్క్, వీల్స్ ఇండియా కంపెనీల ఇంటర్వ్యూలకు 321 మంది హాజరు కాగా 182 మంది ఎంపికైయ్యారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న వారికి నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్‌డీఓ శ్యాంమోహన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషాదేవి, ప్లేస్‌మెంట్ అధికారులు గణేష్, కేఎస్ ప్రకాష్, నారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి. సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ ధ్యేయం


వరదయ్యపాళెం: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


శ్రీకాళహస్తి : మందులు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం పోలి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శుక్రవారం విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. వైద్య శిబిరాల్లో స్పెషలిస్టులు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారని, శస్త్రచికిత్సలు అవసరమైతే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రికి సిఫార్స్ చేస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో రఫీఖాన్ మాట్లాడుతూ 800 కుటుంబాలు ఉన్న పోలి సచివాలయ పరిధిలో 510మంది ఓపీ తీసుకున్నారని అన్నారు. వారికి నలుగురు వైద్యులు, పదిమంది ఆశా వర్కర్లతో వైద్యసేవలు అందించామన్నారు. డాక్టర్ రంజిత, రాహుల్ జనరల్ మెడిసిన్, డాక్టర్ సుధీర్ ఎంపేడు పీహెచ్‌సీ గైనిక్, డాక్టర్ విజయదీపిక చిన్నపిల్లల డాక్టరు వైద్య సవేలు అందించారన్నారు. 110మందికి కంటి అద్దాలను అందజేమశామన్నారు. 17మందికి గుండె, కిడ్నీ వంటి దీర్ఘకాలిక ఇబ్బందులు పడుతున్న వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి, తిరుపతి రుయాకు రెఫర్ చేసినట్లు తెలిపారు. మిగిలిన కుటుంబాల్లో కూడా ఆశా వర్కర్ల ద్వారా ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగూర్‌రెడ్డి, నాయకులు జయప్రకాష్, గుణ, కోటేశ్వరావు, చెంచయ్యనాయుడు, వయ్యాల మనోహర్‌రెడ్డి, సురేంద్రయాదవ్, శ్రీనివాసులు, వెంకటరత్నంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు : సత్యవేడు 4వ సచివాలయం పరిధిలో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యనిపుణులు కవిత(జనరల్ సర్జన్,తిరుపతి రుయా). డి. ప్రత్యూష (గైనకాలజిస్టు, తిరుపతి), పీహెచ్‌సీ డాక్టర్లు మురళీకృష్ణ, వనిత కలసి 502మందిని పరీక్షించారు. దాసుకుప్పం పీహెచ్‌సీ సిబ్బంది రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ కార్యదర్శి పి.హరీష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఏ.చెంచులక్ష్మి, ఏఎన్‌ఎంలు లతదేవి, రోస్‌లిన్ తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం : మండల కేంద్రంలోని ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జగనన్న వైద్య శిబి రాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ పీకేఎం బాబు మాట్లాడుతూ బీపీ, షుగర్‌తో పాటు మరో ఏడు రకాల వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. మొత్తం 350 మందికి నిపుణులు వైద్యపరీక్షలు చేసినట్లు వైద్యాధికారి విజయ్ కుమార్ తెలిపారు.


నాగలాపురం పౌష్టికాహార ప్రదర్శన

బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సింధు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ సుధ, జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, వైస్ ఎంపీపీ కుమారి, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, సర్పంచ్ కృష్ణమ శెట్టి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో 694 మందికి వైద్యసేవలు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 694 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యులు లావణ్య, మహాలక్ష్మి, హిమజ, సురేష్ బాబు, నారాయణస్వామి సేవలు అందించారు. 41 మందిని మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. 22 మందికి కళ్లద్దాలను అందజేశారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఎంఈఓ సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవగాహనతోనే బ్రెస్ట్ క్యాన్సర్ దూరం

- స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: నాలుగు పదుల వయస్సు దాటితే బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ తప్పనిసరి అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ అన్నారు. స్విమ్స్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించడం వల్ల మందులతోనే నయం చేసుకోవచ్చన్నారు. ఏటా అక్టోబర్ నెలను క్యాన్సర్ అవగాహన నెలగా గుర్తించారని తెలిపారు. దీని లక్ష్యం బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం, స్క్రీనింగ్ ప్రాముఖ్యతను తెలియజేసి రోగులకు మద్దతుగా నిలబడి వారికి మనోధైర్యం కల్పించడమని వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాదిని నో వన్ షుడ్ ఫేస్ బ్రెస్ట్ క్యాన్సర్ అలోన్‌గా ప్రకటించారని చెప్పారు. కార్యక్రమంలో అంకాలజీ విభాగాధిపతి భార్గవి, అద్వైత్, రవితేజ, ఆదిత్య, కీర్తన, మౌర్యరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ నర్సింగ్ ప్రభావతి, ఏడీ రాజశేఖర్ పాల్గొన్నారు.


పింక్ బెలూన్స్‌ను ఆవిష్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్, వైద్యులు

ఇరుముడి కట్టి శబరిమలైకు..

నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పాలంకరణ, పుష్పార్చన పూజలు వైభవంగా జరిగాయి. ఇరుముడులు ధరించిన భక్తులు శబరిమలైకు వెళ్లేముందు రోజు పుష్పార్చన పూజలు చేయడం ఆనవాయితీ. భక్తులు పుష్పాలతో ఆలయాన్ని, అయ్యప్ప స్వామిని నేత్రపర్వంగా అలంకరించారు. ఆలయం బయట చలువ పందిళ్లు వేశారు. అయ్యప్ప భజనలు, నామస్మరణలతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అయ్యప్ప స్వామి దర్శనానికి భక్తులు అశేష సంఖ్యలో విచ్చేశారు. 18 మెట్లకు వెలిగించిన కర్పూర దీపాలను దర్శించుకుని పారవశ్యం చెందారు. పుష్పార్చన పూజకు వాడిన పుష్పాలను, తులసిని మహిళలు ప్రసాదంగా తీసుకెళ్లారు. మధ్యాహ్నం వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.


భజన చేస్తున్న భక్తులు